14న ఢిల్లీలో బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 14న బిఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోశ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఆఫీసులో చేపట్టాల్సిన మరమ్మత్తులు, కార్యాలయ ఫర్నీచర్ ఇతర పనులను ప్రముఖ వాస్తు నిపుణులు సుద్దాల సుధాకర్ తేజతో కలిసి పరిశీలించారు.

ఢిల్లీలో కెసిఆర్ ఫ్లెక్సీలు

దేశ రాజధాని ఢిల్లీలో 'దేశం కోసం కెసిఆర్' అనే నినాదంతో బిఆర్ఎస్ అధినేత, సిఎం కె.చంద్రశేఖర్‌రావు ఫ్లెక్సీలను ఆ పార్టీ నేత అలిశెట్టి అరవింద్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు బంధు, దళిత బంధు లాంటి పథకాలను దేశంలో అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనే అని పేర్కొన్నారు. తెలంగాణలోని పథకాలు దేశంలోని రైతులకు, అణగారిన వర్గాలకు అందాలంటే దేశానికి కేసీఆర్ నాయకత్వం అవసరమని తెలిపారు.

యువకుడు దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు సమీపంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణ సమీపంలో యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. టేకులపల్లి సిఐ ఎ.ఇంద్రసేనారెడ్డి కథనం ప్రకారం.. శాంతినగర్ గ్రామానికి చెందిన ధరావత్ అశోక్(27) ఖమ్మం పట్టణంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి భద్రాద్రి జిల్లాలోని తన స్వగ్రామానికి రాగా, ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు గ్రామ పంచాయతీకి చెందిన గుగులోత్ ప్రేమ్ పదేపదే ఫోన్ చేస్తుండడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తెల్లవారినా ఇంటికి రాకపోవడంతో అతని తల్లిదండ్రులు ఆదివారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టగా ముత్యాలంపాడు క్రాస్ రోడ్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మృతదేహం లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. అశోక్ రెండు చేతులు, మణికట్టు కత్తితో కోసి బండరాళ్లతో ముఖంపై బాదినట్టు తెలిపారు. మృతుని తండ్రి ధరావత్ బాలాజీ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు, అనంతరం మర్డర్ కేసుగా గుర్తించి గుగులోతు ప్రేమ్‌పై కేసు నమోదు చేశారు. మృతునికి భార్యతో పాటు మూడు నెలల పాప ఉంది.

మనువాదంతో ప్రమాదం

- ఎన్ఇపిపై అన్ని రాష్ట్రాలు తమ వైఖరిని స్పష్టం చేయాల్సిందే
- విద్యారంగంలో కేరళ అగ్రగామి
- మాటలే కాదు... చేతలతో చూపిన ఎల్‌డిఎఫ్ సర్కార్
- మహాసభల ద్వారా విద్యార్థి ఐక్య ఉద్యమాలకు దిశా నిర్దేశం
- ఎస్ఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మయూక్ బిస్వాస్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత ఎనిమిదేళ్లుగా కేంద్రంలోని మోడీ సర్కార్ కార్పొరేటీకరణ, కాషాయీకరణ విధానాలతో విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించిందని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మయూక్ బిస్వాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది విద్యార్థులకే కాదు... దేశ భవిష్యత్తుకూ నష్టదాయకమని హెచ్చరించారు. ఆర్ఎస్ఎస్ ప్రేరేపిత విధానాలతో మళ్లీ మనువాదాన్ని రుద్దేందుకు బిజెపి ప్రయత్నిస్తోందనీ, ఆయా విధానాలు పూర్తిగా అమలయితే దేశీయ విద్యారంగం మళ్లీ మనవాదం నాటి పరిస్థితుల్లోకే నెట్టివేయబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం (ఎన్ఇపి)పై అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కంటే ముందు, ఆ తర్వాతా విద్యారంగాన్ని నిలబెట్టడంలో కేరళ వామపక్ష ప్రభుత్వం అగ్రగామిగా నిలిచిందని చెప్పారు. కేవలం మాటలే కాక ..చేతల ద్వారా కూడా ఆ రంగం పట్ల తనకున్న చిత్తశుద్ధిని ఆ ప్రభుత్వం నిరూపించిందని వివరించారు. మంగళవారం నుంచి హైదరాబాద్‌లో నిర్వహించబోయే ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభ ద్వారా దేశవ్యాప్తంగా విద్యార్థి ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నామనీ, అందుకనుగుణంగా మహాసభ దిశానిర్దేశం చేయనుందని ఆయన చెప్పారు. మహాసభలో పాల్గొనేందుకు హైదరాబాద్ విచ్చేసిన బిస్వాస్....ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలివి...

1. ప్రస్తుత విద్యారంగ దుస్థితికి కారణం ఏమంటారు?

పాలకవర్గాలు దేశంలో తమకు చవకగా పనివారు కావాలనుకుంటున్నాయి. కేంద్రంలోని బిజెపి సర్కారు దళితులు, ఆదివాసీలు, అల్పసంఖ్యాక వర్గాలు, బాలికలను విద్యకు దూరం పెట్టాలనే విధానాన్ని అవలంభిస్తోంది. ఈ క్రమంలో మేం ఏకలవ్యుడిని చంపిన వారింకా బతికే ఉన్నందుకు సిగ్గుపడుతున్నామనే నినాదంతో ముందుకెళ్తున్నాం. మనువాద వ్యవస్థలో ఎలా ఉండేదో ఇప్పటికీ అవే పరిస్థితులున్నాయి. ఆ వ్యవస్థను పూర్తి స్థాయిలో తీసుకొచ్చే క్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, బాలికల ఉపకారవేతనాల రద్దు, యూనివర్సిటీల్లో సీట్ల తగ్గింపు, మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేయడం తదితర చర్యలకు కేంద్రం పూనుకుంటుంది. ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలకు రిజర్వేషన్లు దక్కకుండా కుట్రలు చేస్తున్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేయడంలో భాగంగా ఉపాధ్యాయలను నియమించడం లేదు. అందుకే దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిలో తీవ్రమైన వ్యత్యాసం చోటు చేసుకుంటోంది. పరిశోధనా సౌకర్యాలు పెంచడం లేదు. ఉద్యోగాల కల్పన లేదు. విద్యార్థులకు భవిష్యత్తు లేకుండా చేయడం ద్వారా దేశానికి భవిష్యత్తు లేకుండా చేయాలనేది వారి ఉద్దేశం.

2. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు మీరు ఏం చేయబోతున్నారు?

ఏ దేశానికైనా యువతే సంపద. మన దేశంలో యువత సంఖ్య ఎక్కువ. దేశ జనాభాలో 35 ఏళ్లలోపు వారే 65 శాతం మంది ఉన్నారు. ఇదే మన దేశానికున్న సానుకూల అంశం. యువత ఐక్యంగా ఉంటే దేశం బలోపేతమవుతుంది. అందుకే దేశాన్ని బలహీనం చేసే క్రమంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు ముందుగా యువతను మనవాద, కార్పొరేట్ విధానాల ఆధారంగా విభజిస్తున్నాయి. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు సముచితంగా చేస్తే అభివృద్ధి ఎలా ఉంటుందనే విషయాన్ని పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఇది వరకే నిరూపించాయి. ప్రస్తుతం కేరళను చూడొచ్చు. కరోనా మహమ్మారికి ముందు, తర్వాత దేశవ్యాప్తంగా డ్రాపౌట్స్ పెరిగితే, గత ఐదేళ్లలో కేరళలో 6.5 లక్షల మంది ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు మారారు. కేరళలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ రూంలను ఏర్పాటు చేశారు. అక్కడ ఆధునాతన తరగతి గదులతో పాటు ప్రతి పాఠశాలలో గ్రంథాలయం, డిజిటల్ సౌకర్యాలున్నాయి. అణగారిన వర్గాల పిల్లల కోసం చేయాలనే సంకల్పం ఉంటే ఎలా చేయగలదో కేరళలో వామపక్ష ప్రభుత్వం చేసి చూపించింది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వమైతే విద్యార్థులపై యుద్ధమే చేస్తోంది. విద్యారంగంపై బడ్జెట్ పెంచితే ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర నియామకాలు పెరుగుతాయి. సౌకర్యాలు మెరుగవుతాయి. కాలక్రమంలో అది దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుంది.

3. మిగతా విద్యార్థి సంఘాలను ఏ విధంగా కలుపుకుని పోతున్నారు?

విద్యార్థులనే లక్ష్యంగా చేసుకున్న బిజెపి విధానాలను వ్యతిరేకిస్తున్న విద్యార్థి సంఘాలను ఐక్య ఉద్యమానికి ఆహ్వానిస్తున్నాం. ఇప్పటికే ఎస్ఎఫ్ఐ ఈ దిశగా కొన్ని ప్రయత్నాలు చేసి ఐక్యపోరాటాలు సాగించింది. కరోనా మహమ్మారి రాకముందు వామపక్ష, ప్రగతిశీల విద్యార్థి ఆర్గనైజేషన్లు, యూనియన్ల వేదికలో భాగస్వామి అయింది. 'ఆల్ ఇండియా ఫోరం టు పబ్లిక్ ఎడ్యుకేషన్' పోరాటంలోనూ భారత విద్యార్థి ఫెడరేషన్ క్రియాశీలకంగా వ్యవహరించింది. విద్యారంగ పరిరక్షణ కోసం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, ఆర్థికవేత్తలు తదితరులతో కూడిన 'జాయింట్ ఫోరం ఆఫ్ మూవ్ మెంట్ ఆన్ ఎడ్యుకేషన్' లోను పాల్గొన్నాం. ఆయా విశ్వవిద్యాలయాల్లో మిగిలిన విద్యార్థి సంఘాలతో కలిసి పోరాటాలు చేస్తున్నాం. ఈ ఐక్యపోరాటాలను క్షేత్రస్థాయిలోనూ నిర్వహించాలని భావిస్తున్నాం.

4. నూతన విద్యా విధానంపై బిజెపియేతర ప్రభుత్వాల వైఖరి ఎలా ఉంది?

నూతన జాతీయ విద్యావిధానాన్ని కేరళ వామపక్ష ప్రభుత్వంతో పాటు తమిళనాడు సర్కారు వ్యతిరేకించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి పశ్చిమబెంగాల్ వరకు బిజెపియేతర ప్రభుత్వాలు ఆ విధానాన్ని అమలు చేస్తున్నాయి. పాఠశాలలను మూసేస్తున్నాయి. ఈ ప్రభుత్వాలు ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యాన్ని (పీపీపీ మోడల్) తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. విద్యార్థి సంఘాల ఎన్నికలను రద్దు చేశాయి. ఒక విద్యార్థికి తాను చదువుకుంటున్న ప్రాంగణంలో నిర్ణయాల్లో భాగస్వామ్యం లేకుండా చేశాయి. విద్యాసంస్థల్లో విద్యార్థి వ్యతిరేక రాజకీయాలతో నింపేశాయి. వీటికి వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌లో అక్కడి టిఎంసి సర్కారు విద్యార్థి ఉద్యమాన్ని ఆ పార్టీ గుండాలు, పోలీసులతో అణిచి వేస్తోంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట ఒక్క విద్య కాషాయీకరణ తప్ప మిగిలిన అన్ని విధానాలు బిజెపి లాగే అమలు చేస్తోంది.

5. హైదరాబాద్లో నిర్వహించబోయే ఎస్ఎఫ్ఐ మహాసభ ద్వారా విద్యార్థి లోకానికి ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారు?

హిందీ ప్రభావిత ప్రాంతాల్లో పలు సమస్యలపై ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరముంది. వికలాంగులు, పేద వర్గాల విద్యార్థులను ప్రధానంగా దృష్టి సారించనున్నాం. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, బాలికలను ఎక్కువగా ఉద్యమంలో భాగస్వాములను చేస్తాం. బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్, మనువాద అనుకూల విధానంపై పోరాటం సాగిస్తాం.

6. మహాసభ ప్రాధాన్యత ఏమిటి?

దేశవ్యాప్తంగా విద్యారంగం సంక్షోభ, సంక్లిష్ట పరిస్థితిలోకి నెట్టబడింది. దానికి ఒక దారితెన్నూ లేకుండా పోయాయి. యుపిఎ హయాంలో తీసుకొచ్చిన సరళీకృత ఆర్థిక విధానాలను మోడీ మరింత వేగంగా అమలు చేస్తున్నారు. ఆ ఫలితంగా విద్యారంగం కూడా తీవ్రమైన పరిస్థితుల్లో కూరుకుపోయింది. ముమ్మందు సాధారణ ప్రజలతో పాటు మధ్యతరగతి వారు కూడా చదువుకునే పరిస్థితులుండవు. కేజీ నుంచి పీజీ వరకు, మెడిసిన్, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ లాంటి వృత్తివిద్యా కోర్సుల్లో చదువుకోవాలంటే లక్షల రూపాయాలు వెచ్చించాల్సి ఉంటుంది. ఇది సామాన్యులకు సాధ్యమయ్యే పని కాదు. దీంతో ఆయా తరగతులు విద్యకు పూర్తిగా దూరమయ్యే ప్రమాదముంది. మహాసభ వీటిపై ఆలోచించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తోంది. చర్చించి తీర్మానాలు ఆమోదిస్తాం.

7. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వ హయాంలో విద్యారంగం ఎలా ఉన్నది.?

అక్కడ విద్యాహక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఆర్‌టిఇ చట్ట ప్రకారం కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం మంది విద్యార్థులను చేర్చుకున్నప్పటికీ వారిని ద్వితీయ శ్రేణి విద్యార్థులుగానే పరిగణిస్తున్నాయి. ఈ విద్యార్థులపై అక్కడి ఉపాధ్యాయులు తగినంత శ్రద్ధ పెట్టడం లేదు. విలీనం పేరుతో పాఠశాలలను మూసేశారు. బిజెపి చేస్తున్న విద్యా కాషాయీకరణపై ఇప్పటికే ఆమ్ ఆద్మీ పార్టీ నోరు విప్పలేదు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో నమోదు పరంగా చూస్తే ఢిల్లీలో 91 శాతంగా ఉంటే, కేరళలో 98 శాతంగా ఉంది.

29న చలో ఖమ్మం

- లక్ష మంది వ్యవసాయ కూలీలతో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- హాజరు కానున్న కేరళ సిఎం పినరయ్ విజయన్
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభ సందర్భంగా ఈ నెల 29న లక్ష మంది వ్యవసాయ కార్మికులతో ఖమ్మంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్టు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ప్రకటించారు. ఈ బహిరంగ సభలో కేరళ సిఎం పినరయ్ విజయన్ పాల్గొంటారని, వ్యవసాయ కార్మికులంతా దీన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థలకు నిధులను తగ్గించి పనులను నీరుగారుస్తోందని విమర్శించారు. అట్టడుగు వర్గాలుగా ఉన్న ఆదివాసీ గిరిజనులు, దళిత మహిళలపై లైంగికదాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులకు శిక్షలు వేయకుండా పూలదండలు వేసి విడుదల చేస్తున్న పరిణామాలను తప్పుబట్టారు. దేశంలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్టు, అటవీ హక్కుల చట్టం, భూసేకరణ పునరావాస చట్టాలను అమలు చేయకుండా మోడీ ప్రభుత్వం తొక్కిపెడుతోందని విమర్శించారు. దీని ఫలితంగా పేదలు తమ హక్కులను కోల్పోతున్నారని వాపోయారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, అర్హులందరికీ పింఛన్లు, దళిత బంధు పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ముసురు

- వచ్చే రెండ్రోజులు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రం మీదుగా తూర్పు, ఆగ్నేయ దిశ నుంచి తెలంగాణ మీదుగా చల్లటి గాలులు వీస్తుండడంతో వాతావరణం చల్లబడింది. హైదరాబాద్ నగరాన్ని మబ్బు కమ్మేసింది. వచ్చే 24 గంటలపాటూ మేఘావృతమై ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఉదయం పూట పొగమంచు ఏర్పడే అవకాశం ఉంది. రాబోయే మూడు రోజులపాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందనీ, అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కూడా పడే సూచనలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. ఆదివారం రాత్రి తొమ్మిది గంటల వరకు రాష్ట్రంలో 159 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైనట్టు తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్, ప్లానింగ్ సొసైటీ వెదర్ రిపోర్టులో తెలిపింది. రంగారెడ్డి జిల్లా పరిధిలోని శేరిలింగంపల్లి పరిధిలో అత్యధికంగా 2.35 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

ఆర్ఎస్ఎస్ డైరెక్షన్‌లో దేశాన్ని పాలిస్తున్న బిజెపి : గజ్జెల కాంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్ఎస్ఎస్ డైరెక్షన్‌లో బిజెపి దేశాన్ని పాలిస్తోందని ప్రజాసంఘాల జెఎసి చైర్మెన్ గజ్జెల కాంతం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిబిఐ, ఐటి, ఇడి తదితర కేంద్ర సంస్థలు బిజెపికి ఏజెంట్‌గా పని చేస్తున్నాయని ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ సంస్థలు ఎందుకు దాడులు చేయడం లేదని ప్రశ్నించారు. అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. సింగరేణిని ప్రయివేటీకరించబోమంటూనే సింగరేణి నాలుగు బ్లాకులను ప్రయివేటీకరణ ఎలా చేశారో తెలిపాలని, బండి సంజయ్‌కి రూ.700 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు.

రాష్ట్రానికి17 ఖేలో ఇండియా సెంటర్లు

- మరిన్ని ఇవ్వాలి
- శాట్స్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రప్రభుత్వం తెలంగాణకు 17 ఖేలో ఇండియా సెంటర్లను మంజూరు చేసిందని శాట్స్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గడచిన ఆరు నెలలుగా తాము అనేక లేఖలు కేంద్రానికి రాసామనీ, అయినా కోరినన్ని కేంద్రాలు ఇవ్వలేదని ఆక్షేపించారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు 34 ఖేలో ఇండియా సెంటర్లు మంజూరు చేసి, తెలంగాణకు కేవలం 17 మాత్రమే మంజూరు చేశారన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై చూపుతున్న వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత యువతీ యువకులు క్రీడల్లో గొప్పగా ఎదిగి, భారత దేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఉత్సాహంగా ఉన్నారని చెప్పారు. ఈ 17 ఖేలో ఇండియా సెంటర్లను త్వరలో ప్రారంభించి శిక్షణ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వమూ స్పోర్ట్స్ పాలసీని తెచ్చి క్రీడాకారులను ప్రోత్సహించనున్నదని తెలిపారు.

క్రీడ	ఖేలో ఇండియా సెంటర్
ఆర్చరీ	ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్,
హాకీ	యాద్రాద్రి భువనగిరి, ఆదిలాబాద్, నల్గొండ
సైక్లింగ్	మెదక్, ములుగు, సిద్దిపేట
ఫుట్‌బాల్	వనపర్తి
అథ్లెటిక్స్	నారాయణపేట్
బాట్మింటన్	కామారెడ్డి
జూడో	కరీంనగర్, వరంగల్
ఆర్చరీ	నిజామాబాద్
బాక్సింగ్	హన్మకొండ
ఖోఖో	మహబూబాబాద్



సంకల్ప ఆశీస్సు యాత్రలో కాంట్రాక్టు అధ్యాపకులు

రెండవ రోజు కొనసాగిన.. కాంట్రాక్టు అధ్యాపకుల సంకల్ప ఆశీస్సు యాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన సంకల్ప ఆశీస్సు యాత్ర ఆదివారం రెండవ రోజూ కొనసాగింది. ఉద్యోగాల క్రమబద్ధీకరణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరగటానికి గజ్వేల్ నుంచి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్దకు చేపట్టిన సంకల్ప ఆశీస్సు యాత్ర రెండో రోజు తిమ్మారెడ్డిపల్లి నుంచి ప్రారంభమైంది. తిమ్మారెడ్డిపల్లి నుంచి కొండపాక క్రాస్ రోడ్డు మీదుగా దుద్దెడ రాజీవ్ రహదారిపై నుంచి సిద్దిపేటకు వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి రమణారెడ్డి, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు ఉద్యోగులు, లెక్చరర్ల బాధలను ప్రత్యక్షంగా చూసిన సిఎం కెసిఆర్ మానవతా దృక్పథంతో 2016లో జిఒ నెంబర్ 16 ద్వారా క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. కానీ అనివార్య కారణాల వల్ల క్రమబద్ధీకరణ ఇంతవరకు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమబద్ధీకరణకు ఎటువంటి ఆటంకాలు లేకుండా త్వరగా జరిగేలా చూడాలని కోరుతూ కెసిఆర్ ఇష్టదైవం కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని ఈ సంకల్ప ఆశీస్సుల యాత్రను చేస్తున్నామని తెలిపారు. సోమవారం ఉదయం సిద్దిపేట నుంచి కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి సన్నిధికి యాత్ర బయలుదేరుతుందని తెలిపారు. ఈ యాత్రకు తెలంగాణ పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉదయ భాస్కర్ సంఘీభావం తెలిపారు. యాత్రలో.. 475 అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ శ్రీనివాస్ శంకర్, ప్రవీణ్, గోవర్ధన్, కృష్ణవేణి, గురుమూర్తి, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిలర్స్, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కాంట్రాక్టు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మోటరుకు మీటర్.. సంక్షోభంలో సాగు

- విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తే రైతుపై పెనుభారం
- రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేస్తున్న కేంద్రం
- అమలైతే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ రంగంపై రూ.808 కోట్ల భారం
- ఆహార ఉత్పత్తుల కొరత తీవ్రరూపం దాల్చనుందని నిపుణుల అంచనా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టాలనే ఉద్దేశంతో కేంద్ర మోడీ సర్కార్ మరో కుట్రకు తెర లేపింది. విద్యుత్ సంస్కరణల పేరుతో రైతులపై ఆర్థిక భారం మోపి, వారిని వ్యవసాయ రంగాన్ని దూరం చేయాలని చూస్తోంది. ఇప్పటి వరకు బాయిలా కాడ బోర్లకు రైతులు ఉచిత కరెంట్ పొందారు. కేంద్రం తీసుకొస్తున్న విద్యుత్ సంస్కరణలు రాష్ట్రంలో అమలైతే ఒక్కో మోటరుపై నెలకు రూ.5వేల బిల్లు చెల్లించాల్సి వస్తుంది. అయితే ఇప్పటి వరకు రాష్ట్రంలో ఇది అమలు చేయనప్పటికీ.. కచ్చితంగా అమలు చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తుంది. కేంద్ర ఒత్తిడికి రాష్ట్రం తలొగ్గితే వ్యవసాయం కుంటుపడే పరిస్థితి ఉంది. ఇప్పటికే సాగు ఖర్చు పెరిగి, పంటకు గిట్టుబాటు రాక అల్లాడుతున్న రైతులపై కేంద్ర నిర్ణయం 'ములుగుతున్న నక్కపై తాటి పండు పడ్డ' చందంగా మారనుంది. దీని ప్రభావంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గి, ఆహార ఉత్పత్తుల కొరత రానుందని నిపుణులు భావిస్తున్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో పూర్తి స్థాయిలో విద్యుత్ మోటర్ల వినియోగంతో వ్యవసాయం కొనసాగుతోంది. రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయ మోటర్లు వాడుతున్న జాబితాలో రంగారెడ్డి జిల్లా మొదటి వరుసలో ఉంది. జిల్లాలో మొత్తం



1,73,817 కనెక్షన్లు ఉన్నాయి. సుమారు ఐదు లక్షల మోటర్లు నడుస్తున్నాయి. ఇందుకు గాను జిల్లాలో ప్రతి నెలా 90 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఖర్చు అవుతుందని విద్యుత్ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ లెక్కన ఏడాదిలో 7,200 మిలియన్ యూనిట్లు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఇందుకు ఛార్జీ చేయాల్సిన బిల్లు రూ.808 కోట్లు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉచిత విద్యుత్ పథకం అమలు అవుతుండటంతో రైతులపై ఎలాంటి భారం లేదు

నెలకు రూ.5వేల బిల్లు..?

కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తే ఒక మోటర్‌పై నెలకు సుమారు. రూ.ఐదు వేల బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయానికి రైతులు 3 హార్స్ పవర్, 5 హార్స్ పవర్ మోటార్లు వాడుతుంటారు. ఒక 5 హెచ్‌పీ మోటారు ఒక గంట పొలానికి నీళ్లు పెట్టడానికి వాడితే 3.7 యూనిట్ల విద్యుత్ ఖర్చు అవుతుంది. ఇలా రోజుకు సరాసరిన 7 గంటలు ఒక రైతు తన మోటారు నడిపిస్తే 25.9 యూనిట్ల విద్యుత్ ఖర్చు అవుతుంది. ఈ లెక్కన నెలకు ఒక మోటర్‌కు 777 యూనిట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ఇందుకు యూనిట్‌కు రూ.6.9 ఛార్జీ చేయగా 777 యూనిట్లకు సుమారు రూ.5,361లు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఏడాదికి సుమారు రూ.60 వేలు చెల్లించాల్సి వస్తోంది. రంగారెడ్డి జిల్లాలోని కొత్తూరు మండలంలో 18 వేల కనెక్షన్లు ఉండగా నెలకు 10 లక్షల యూనిట్ల విద్యుత్ ఖర్చు అవుతుంది. ఇందుకు బిల్లు రూ. ఆరు కోట్లు వస్తోంది. ఏడాదికి గాను రూ.36 కోట్ల విద్యుత్ బిల్లును ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. సబ్సిడీలో కోతలు విధిస్తే ఈ ప్రాంత రైతాంగంపై కోట్ల భారం పడనుందని విద్యుత్ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

రైతుకు మిగిలేది శూన్యమే

కేంద్రం మోటర్‌కు మీటర్ పేరుతో విద్యుత్ బిల్లు లాక్కోవాలని చూస్తోంది. ఇదే జరిగితే రైతుకు మిగిలేది శూన్యమే. వరి పంట సాగు చేయాలంటే ఒక మోటర్ నడిపిస్తే సుమారు రెండు ఎకరాలు సాగు చేయొచ్చు. రెండు ఎకరాల్లో సాగు చేసిన పంట మంచి దిగుబడి 50 క్వింటాలు వస్తే రూ.లక్ష ఆదాయం వస్తోంది. పంట సాగు ఖర్చులు ఎకరాకు సుమారు రూ.30 వేల చొప్పున రూ.60 ఖర్చు వస్తోంది. ఇది పోగా రైతుకు మిగిలేది రూ.40 వేలు మాత్రమే. ఇది కూడా పంట మంచి దిగుబడి వస్తేనే, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే రైతు సంగతి అంతే. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ కూలీలు, వ్యవసాయ యంత్రాల కిరాయి, డీజిల్ ధరలతో వ్యవసాయం అగమ్యగోచరంగా తయారైంది. ఇప్పుడు విద్యుత్ ఖర్చులు కూడా రైతు నెత్తిన వేస్తే సంక్షోభంలో ఉన్న వ్యవసాయం రంగం మరింత ఊబిలోకి చేరనుంది. ఇదిలా ఉండగా ఇలాంటి రైతు వ్యతిరేక విధానాల వలన వ్యవసాయం చేసే వాళ్లు లేక, ఆహార భద్రతనే ప్రశ్నర్థకంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. కేంద్రం విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాల్సిందేనని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మోటర్‌కు మీటర్ రైతుకు శాపం

సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వ్యవసాయ రంగంపై కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలతో విద్యుత్ బిల్లు భారం మోపడం రైతుల నడ్డి విరవడమే. ఈ ప్రభావం దేశ ఆహార ఉత్పత్తులపై చూపుతుంది. కేంద్రం తమ ఆనాలోచిత నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలి.

- మధుసుదన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా రైతు సంఘం కార్యదర్శి

పెళ్లిరోజే వధువు ఆత్మహత్య

- ఉద్యోగం చేయాలని వరుడి వేధింపులే కారణం ?
- పెళ్లింట విషాదఛాయలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాసేపట్లో పెళ్లి పీటలెక్కాల్సిన యువతి.. ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ రాజారెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కోమటిగల్లికి చెందిన ర్యాగళ్ల రవళి(26)కి మూడు నెలల కిందట నిజామాబాద్‌లోని జెండా గల్లీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సంతోష్‌తో నిశ్చితార్థం అయింది. కాగా నిజామాబాద్‌లోని జనార్ధన్ గార్డెన్‌లో ఆదివారం పెళ్లికి వెళ్లాల్సి ఉండగా.. అంతలోనే వధువు వేకువజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

రవళి ఎంసిఎ చదవడంతో తనతో పాటు ఉద్యోగం చేయాలని వరుడు సంతోష్ వేధించడమే మృతికి కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు మీడియాతో తెలిపారు. శనివారం రాత్రి ఆటపాటలతో పెళ్లి సంబురాలు చేసుకున్న కుటుంబంలో వధువు మృతితో శోకసంద్రంలో మునిగింది. రాత్రి 12 గంటల తర్వాత వరుడితో ఫోన్లో మాట్లాడిన అనంతరం మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని తెలిపారు. కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు నిర్వహిస్తున్నామని సిఐ తెలిపారు.

ఆర్టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వీరాంజనేయులు, విఎస్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

టిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) నూతన ఆఫీస్ బేరర్స్ కమిటీ 19 మందితో ఎన్నికైంది. ఈ నెల 10, 11 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఫెడరేషన్ రాష్ట్ర తృతీయ మహాసభల్లో ఈ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వీరాంజనేయులు (మహబూబ్‌నగర్-సెంటర్), విఎస్ రావు (రాష్ట్ర కేంద్రం) నుంచి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సిహెచ్ రాంచందర్ (వరంగల్), కె గీత (సికింద్రాబాద్), ఎమ్ ప్రభాకర్ (మహబూబ్‌నగర్), ఎస్ కృష్ణ (హైదరాబాద్), బిక్షపతిగౌడ్ (రాష్ట్ర కేంద్రం), ఎవి రావు (రాష్ట్ర కేంద్రం), ఎ వెంకటేశ్వర్లు (ఖమ్మం) ఎన్నికయ్యారు. ఉప ప్రధాన కార్యదర్శిగా గడ్డం లింగమూర్తి (ఖమ్మం), కార్యదర్శులుగా జిఆర్ రెడ్డి (గ్రేటర్ హైదరాబాద్ జోన్), జె పద్మావతి (ఖమ్మం), బి సుధాకర్ (నల్లగొండ), టి ఎల్లయ్య (వరంగల్), ఎమ్ భీమ్‌రావ్ (ఆదిలాబాద్), పి చంద్రప్రకాశ్ (హైదరాబాద్), కెఎస్ రెడ్డి (జెడ్‌డబ్ల్యుఎస్, ఉప్పల్), ప్రచార కార్యదర్శిగా పోరెడ్డి రవీందర్‌రెడ్డి (రాష్ట్ర కేంద్రం), కోశాధికారిగా కుడిదల గంగాధర్ (హెడ్ ఆఫీస్) ఎన్నికయ్యారు.

ఎనిమిది తీర్మానాలకు ఆమోదం

ఆర్‌టిసి కార్మికులకు సంబంధించిన ఎనిమిది తీర్మానాలను రెండోరోజైన ఆదివారంనాడు మహాసభ ఆమోదించింది. 'కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తున్న కొత్త లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి' అనే తీర్మానాన్ని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి రవీందర్‌రెడ్డి మహాసభలో ప్రవేశపెట్టారు. దీన్ని ఖమ్మం రీజియన్ నాయకులు గుండు మాధవరావు బలపర్చారు. 'ఆర్‌టిసిని విస్తరించి, బడ్జెట్‌లో రెండు శాతం నిధులు కేటాయించాలి' అనే తీర్మానాన్ని ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు కె గీత ప్రవేశపెట్టగా, వరంగల్ రీజియన్ కార్యదర్శి ఎల్లయ్య బలపరిచారు. 'డబుల్ డ్యూటీకి డబుల్ వేతనం చెల్లించాలి' అనే తీర్మానాన్ని రాష్ట్ర కార్యదర్శి బి బిక్షపతి ప్రవేశపెట్టగా, నల్గొండ రీజియన్ కార్యదర్శి సుధాకర్ బలపరిచారు. 'స్క్రాప్ బస్సులు తొలగించి, కొత్తవి ప్రవేశపెట్టాలి. ప్రయాణీకుల అవసరాలకు తగినన్ని బస్సుల్ని నడపాలి' అనే తీర్మానాన్ని నల్గొండ రీజియన్ కార్యదర్శి సుధాకర్ ప్రవేశపెట్టగా, కరీంనగర్ రీజియన్ కార్యదర్శి శ్రీనివాస్ బలపరిచారు. 'అద్దెబస్సులు రద్దు చేయాలి-ఆర్టీసీ బస్సులు పెంచాలి. ఆర్‌టిసిలోని ఖాళీలను రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీచేసి, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలి' అనే తీర్మానాన్ని హైదరాబాద్ రీజియన్ అధ్యక్షులు కృష్ణ ప్రవేశపెట్టగా, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి మల్లయ్య బలపరిచారు. 'గ్యారేజ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. అవసరమైన స్పేర్స్, టూల్స్ సప్లయ్ చేయాలి' అనే తీర్మానాన్ని నల్గొండ అధ్యక్షులు కే నర్సింహా ప్రవేశపెట్టారు. 'టిఎస్ఆర్‌టిసిలో పనిభారాలు తగ్గించాలి. కార్మిక చట్టాలు అమలు చేయాలి' తీర్మానాన్ని గ్రేటర్ హైదరాబాద్ జోనల్ కార్యదర్శి జిఆర్ రెడ్డి ప్రవేశపెట్టగా, అదే జోనల్ అధ్యక్షులు చంద్రప్రకాశ్ బలపరిచారు. 'టిఎస్ ఆర్‌టిసి కార్మికుల ఆర్థిక అంశాలు వెంటనే పరిష్కరించాలి' అనే తీర్మానాన్ని ఆదిలాబాద్ రీజియన్ కార్యదర్శి ఎమ్‌బీ రావు మహాసభలో ప్రవేశపెట్టగా, వనపర్తి డిపో నాయకులు స్వామి బలపర్చారు.

అగ్రోస్ చైర్మెన్‌గా తిప్పన బాధ్యతలు

హాజరైన మంత్రులు జగదీష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అగ్రోస్ నూతన చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ నాంపల్లిలోని ఆగ్రోస్ కార్యాలయంలో ఆదివారం మంత్రుల సమక్షంలో ఆగ్రోస్ సిఎండి కె రాములు ఆయనతో ఫైల్ సంతకం చేయించారు. విజయ సింహారెడ్డికి మంత్రులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు జగదీష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, గాదరి కిషోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపి బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునాతన మార్కెట్‌గా కోహెడ : నిరంజన్‌రెడ్డి

ప్రపంచంలోనే కోహెడ ఆధునాతన మార్కెట్‌గా నిర్మాణం కాబోతోందని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. కోహెడ మార్కెట్ స్థలాన్ని మంత్రి, అధికారులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవరణంలో గోదాములు, లాజిస్టిక్ పార్క్, ప్రాసెసింగ్ ప్లాంట్, వేస్ట్ మేనేజ్ మెంట్, రీ సైక్లింగ్, సోలార్ సిస్టమ్, కోల్డ్ స్టోరేజ్ గోదాంలు, రైపెనింగ్ చాంబర్లు, లేబర్, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్, ట్రిపుల్ ఆర్ రహదారి ఏర్పాటు, అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులో ఉన్న నేపథ్యంలో కోహెడ మార్కెట్‌కు అత్యంత ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు, కార్యదర్శి నర్సింహారెడ్డి ఉన్నారు.

'ప్రతిష్ట ఇండస్ట్రీస్ లిమిటెడ్' అక్రమ లే ఆఫ్ ఎత్తేయాలి

- తొలగించిన 43 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
- మంత్రి కెటిఆర్‌కు తమ్మినేని బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం పరిధిలోని ప్రతిష్ట ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ అక్రమ లే ఆఫ్‌ను ఎత్తివేసి తొలగించిన 43 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మంత్రి కెటిఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖ పత్రాలను సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, కార్మికులకు వేతన ఒప్పందం చేయాలని గతంలో కార్మికశాఖ అధికారుల సమక్షంలో యాజమాన్యం, యూనియన్ నాయకుల మధ్య



బహిరంగ లేఖ పత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

16 సార్లు చర్చలు జరిగాయని తెలిపారు. యాజమాన్యం నుంచి స్పందన లేకపోవడంతో 2022 సెప్టెంబర్ 22 నుంచి కార్మికులందరూ సమ్మెలోకి వెళ్లారని చెప్పారు. స్పందించిన కార్మికశాఖ మంత్రి సీహెచ్. మల్లారెడ్డి పరిశ్రమ వద్దకు వచ్చి లేబర్ అధికారుల సమక్షంలో యూనియన్ నాయకత్వం, యాజమాన్యంతో చర్చలు జరుపగా రూ.3200 వేతన ఒప్పందంతోపాటు ఇతర సమస్యలూ పరిష్కరిస్తామని యాజమాన్యం ఒప్పుకుందన్నారు.

అదే రోజు మంత్రి మల్లారెడ్డి, కంపెనీ ఎమ్‌డీ సమ్మె శిబిరం వద్దకు వచ్చి చర్చల వివరాలను కార్మికులకు వివరించి సమ్మె విరమింపజేశారని తెలిపారు. మంత్రి ముందు జరిగిన ఒప్పందాన్నీ కంపెనీ యాజమాన్యం లెక్కచేయకుండా 2022 అక్టోబర్ 13 నుంచి కార్మికులను విధుల్లోకి రానీయకపోవడంతో ఈ విషయాన్ని మంత్రి కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. 2022 అక్టోబర్ 27న కార్మికశాఖ మంత్రి మళ్లీ పరిశ్రమ వద్దకు వచ్చి యాజమాన్యంతో మాట్లాడి కార్మికులందరిని విధుల్లోకి పంపించినట్టు తెలిపారు.

మునుగోడు ఉప ఎన్నిక ముగిసిన తర్వాత నవంబర్ 5 నుంచి 43 మంది కార్మికులను మళ్లీ డ్యూటీలోకి అనుమతించడం లేదని మంత్రి కేటీఆర్‌కు విన్నవించారు. కార్మికుల కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే స్పందించాలని కోరుతూ అక్రమ లే ఆఫ్‌ను ఎత్తివేయడంతోపాటు 43 మంది కార్మికులను వెంటనే డ్యూటీలోకి తీసుకొని కోరారు. మంత్రి మల్లారెడ్డి సమక్షంలో జరిగిన వేతన ఒప్పందంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తమ్మినేని వీరభద్రం బహిరంగ లేఖలో పేర్కొన్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శులు గడ్డం ఈశ్వర్, తుర్కపల్లి సురేందర్, సుబ్బారు సత్యనారాయణ, గొరిగె సోములు, కోశాధికారి దోనూరి నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎమ్‌డి.పాషా, కూరెళ్ల రాములు పాల్గొన్నారు.



శాస్త్రీయ కళలు భారతీయ సంస్కృతి కి మూలాలు

ప్రజాశక్తి-కల్చరల్

శాస్త్రీయ కళలు భారతీయ సంస్కృతికి మూలాలని మేడ్చెల్, మెదక్ జిల్లాల కలెక్టర్ డాక్టర్ హెచ్ హరీష్ అన్నారు. శాస్త్రీయ సంగీతం పై పట్టు ఉంటే లలిత సంగీతం కానీ సినీ పాటలు కానీ అలవోకగా అలపించవచ్చని ఆయన చెప్పారు. శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై ఆదివారంనాడు రాగ వాహిణి మ్యూజిక్ అకాడమీ, సౌందర్య గాన లహరి సంయుక్తంగా సంగీత సుమాంజలి పేరిట శాస్త్రీయ సంగీత గాన గోష్ఠి రస బంధురం సాగింది. కార్యక్రమన్ని డాక్టర్ హరీష్ ప్రారంభించారు. విఖ్యాత శాస్త్రీయ సంగీత గాయని హరి ప్రియ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతంకు ఆదరణ తగ్గలేదని ఆడిటోరియంలో నిండుగా ఉన్న ప్రేక్షకులను చూస్తే తెలుస్తోందని అన్నారు .సంస్థల నిర్వాహకులు చివుకుల మాధవి, గుడిపాటి భాగ్య లక్ష్మిల ప్రతిభకు వారి శిక్షణలో రూపొందిన గాయకులు నిదర్శనమన్నారు. శశిరేఖ వ్యాఖ్యానంలో భాగ్యలక్ష్మి శిష్య బృందం శ్రీ ప్రియ శశి థమన్, శారదా కృతి, కృష్ణ స్తుతి, అదితి తదితరులు పురందర దాసు విరచిత గణపతి స్తుతితో గానగోష్ఠి ఆరంభించారు. అన్నమయ్య, రామదాసు కీర్తనలు మధురంగా గానం చేశారు. చివుకుల మాధవి శిష్యురాండ్రు నారాయణ తీర్థ, సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలు స్వర లయ తాల బద్ధంగా అలపించి శ్రోతలను రసానందంలో ముంచెత్తారు.

బాలు వంశీ శుభోదయం పురస్కారాలు

ప్రజాశక్తి - కల్చరల్

వంశీ ఇంటర్నేషనల్, లిటిల్ మ్యూజిక్ అకాడమీ సంయుక్తంగా శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై ఈ నెల 15 న బాలు పాటకు పట్టాభిషేకం పేరిట సినీ గాన లహరి ప్రముఖ గాయకుడు రామాచారి శిష్య బృందంచే శుభోదయం గ్రూప్ సౌజన్యంతో నిర్వాహిస్తున్నామని వంశీ రామ రాజు విలేకరులకు తెలిపారు. విఖ్యాత గాయకుడు ఎస్‌పి బాల సుబ్రహ్మణ్యం తొలి పాటను పాడి 56 వసంతాలు పూర్తయిన సందర్భం పురస్కరించుకొని సీల్ వెల్ కార్పొరేషన్ సహకారంతో జరుగుతున్న ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన మండలి సభ్యురాలు వాణీ దేవి పాల్గొనగా అంజయ్య చౌదరి, దర్శకులు చంద్ర సిద్దార్ద్, రేలంగి నరసింహరావు, బండారు సుబ్బారావు, ఆలేఖ్య హోం ఎండి కుర్ర శ్రీనాథ్, శుభోదయం లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొంటారు. ఈ సందర్భంగా స్వర కర్త ఆర్‌పి పట్నాయక్, గాయకుడు రామా చారి, బాలు విగ్రహ ప్రతిష్ట చేసిన పొత్తూరి రంగా రావులను సత్కరిస్తారు.

ఇండియన్ రేసింగ్ లీగ్ విజేత కొచ్చి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ తీరాన రెండు రోజులపాటు జరిగిన ఇండియన్ రేసింగ్ లీగ్ ఆదివారం విజయవంతంగా ముగిసింది. రేస్‌లో అన్ని రౌండ్లు కూడా ఎంతో ఉత్కంఠగా సాగాయి. ఆఖరి రౌండ్‌కు వచ్చే సరికి కొచ్చి, హైదరాబాద్ జట్టు మధ్య హోరా హోరీ పోరు కొనసాగింది. ఆఖరి ఫీచర్ రేస్‌లో చెన్నై జట్టు గెలవగా.. మొత్తంగా ఇండియన్ రేసింగ్ లీగ్‌లో 417.5 పాయింట్లతో కొచ్చి విజేతగా నిలిచింది.

385 పాయింట్లతో హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ రెండో స్థానంలో నిలిచింది. 282 పాయింట్లతో గోవా మూడో స్థానం, 279 పాయింట్లతో చెన్నై నాలుగు, 147.5 పాయింట్లతో బెంగళూరు ఐదు, 141 పాయింట్లతో ఢిల్లీ టీమ్ ఆరు స్థానాల్లో నిలిచాయి. మొదటి రోజు ఆలస్యంగా ప్రారంభమైన రేసులు.. రెండో రోజు షెడ్యూల్ ప్రకారం సమయానికి పూర్తయ్యాయి. సాగర్ చుట్టూ మొత్తం 2.7 కిలోమీటర్ల ట్రాక్ ఉండగా.. ఏడు ప్రాంతాల్లో ప్రేక్షకుల కోసం గ్యాలరీలు ఏర్పాటు చేశారు.

పిసిసి ఇసి సభ్యత్వానికి కొండా సురేఖ రాజీనామా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎఐసిసి ప్రకటించిన తెలంగాణప్రదేశ్ కమిటీలు తనకు అసంతృప్తిని కలిగించాయని మాజీ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ మేరకు పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఆదివారం ఆమె బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. "తెలంగాణ పిసిసిలో నా పేరు లేకపోవడమే కాదు వరంగల్ జిల్లాకు సంబంధించి ఏ నాయకుడి పేరు లేకపోవడం మనస్తాపం కలిగించింది. తెలంగాణ ప్రదేశ్ రాజకీయ వ్యవహారాల కమిటీలో నాకంటే జూనియర్లకు అవకాశం ఇచ్చారు. నన్ను మాత్రం తెలంగాణ ప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా నియమించడం జీర్ణించుకోలేకపోతున్నా. తెలంగాణ ప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో నన్ను నియమించడం అవమానపరిచినట్టుగా భావిస్తున్నా. నాకు పదవులు ముఖ్యం కాదు.. ఆత్మాభిమానం ముఖ్యం. మా కుటుంబం 34 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్నాం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా మమ్మల్ని అభిమానించే వారు ఉన్నారు.

రాజకీయ వ్యవహారాల కమిటీలో రాజకీయ బతుకుదెరువుకోసం మూటముల్లె సర్దుకుని ఇతర పార్టీల నుంచి వచ్చిన వారితో నిండిపోయింది. కనీసం ఎమ్మెల్యేగా కూడా ఎన్నిక కాని వాళ్లను, నామినేట్ చేసిన కమిటీలో నన్ను నామినేట్ చేయడం అవమానపర్చినట్టుగా భావిస్తున్నా. నేను, నా భర్త వరంగల్ ఈస్ట్, పరకాల నియోజకవర్గ ప్రజలకు అందు బాటులో ఉంటూ.. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ సామాన్య కార్య కర్తలుగా కొనసాగుతాం" అని కొండా సురేఖ లేఖలో పేర్కొన్నారు.



కొండా సురేఖ

వచ్చే ఎన్నికల్లో నల్లగొండ నుంచే పోటీ చేస్తా..

- ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే ఎన్నికల్లో నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచే తాను పోటీ చేస్తానని, ఆ విషయంలో ఎవరికీ అనుమానం అక్కర్లేదని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనవరి నుంచి రెగ్యులర్‌గా నల్లగొండలో పర్యటిస్తానని, తనను ఈ స్థాయికి తీసుకొచ్చిన నల్లగొండ నియోజకవర్గ ప్రజలను మరవనని, వారికి ఎల్లవేళలా అందుబాటులోఉంటానని తెలిపారు. ప్రస్తుతం రాజకీయాలు మాట్లాడనని, ఎన్నికలకు నెలరోజుల ముందే రాజకీయాలు మాట్లాడుతానన్నారు. నల్లగొండ నియోజకవర్గ ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటానని, రైతు సాగునీటి కష్టాలు ఇప్పటికే పరిష్కరించానని తెలిపారు. నియోజకవర్గంలో ఏ పనికైనా ప్రజలు తనను ఫోన్ ద్వారా సంప్రదిస్తున్నారని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నానని చెప్పారు. సిఎం కెసిఆర్ నాలుగేండ్ల కిందటే నల్లగొండను దత్తత తీసుకున్నా అభివృద్ధి ఏమి జరగలేదని విమర్శించారు. దత్తత అనే మాటకు అర్థం తేవాలంటే పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నల్లగొండ నియోజకవర్గంలో ఏడాదిలోగా పట్టణంలో 5000, గ్రామాల్లో 300 ఇండ్ల చొప్పున డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. రోడ్లు వెడల్పు చేసి బొమ్మలు పెడితే అభివృద్ధి చెందినట్టు కాదన్నారు.

కబ్జా కోరల్లో 'మూసీ'

- నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం డంపింగ్
- జిహెచ్‌ఎంసి, రెవెన్యూ, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, చెరువులు కబ్జా కోరల్లో చిక్కుకోగా.. మూసీ పరివాహక ప్రాంతాలు కూడా ఆక్రమణలో చిక్కుకుని నీరు పారడానికి ఇబ్బంది తలెత్తుతోంది.. చినుకు పడితే దిగువకు వెళ్లే అవకాశం లేకుండా పోతోంది. ఇప్పటికే హైదరాబాద్ నగరంలో ఎన్నో చెరువులు తమ ఉనికిని కోల్పోయాయి. జియాగూడ, పురాణాపూల్ శ్మశాన వాటిక, జుమ్మేరాత్ బజార్, అఫ్జల్‌గంజ్, చాదర్‌ఘాట్, గోల్నాక తదితర మూసీ పరివాహక ప్రాంతాలు కబ్జాకు గురవుతున్నాయి. ఇదే తరహాలో మూసారాంబాగ్‌లోని మూసీ పరివాహక ప్రాంతాన్ని భూ కబ్జాదారులు దర్జాగా ఆక్రమించుకుంటున్నారు. పరిరక్షించాల్సిన ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

చినుకుపడితే చాలు గ్రేటర్ హైదరాబాద్ అతలాకుతలమవుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే.. దిగువన మూసీ పరివాహక ప్రాంతాలు పొంగి పొర్లుతున్నాయి. దాంతో పలు బస్తీలు, కాలనీలు, రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. కొద్ది రోజుల కిందట నగరంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మూసీ పొంగిపొర్లింది. మూసారాం బ్రిడ్జిపై నుంచి వరద పారడంతో రాకపోకలు బంద్ చేశారు. వర్షం కురిసినప్పుడల్లా బ్రిడ్జిపై మురుగునీరు వెళ్లడం, ఈ క్రమంలో అధికారులు రాకపోకలను నిలిపివేయడం పరిపాటిగా మారింది. మూసీ పరివాహక ప్రాంతం కబ్జాలకు గురికావడంతోనే ఈ దుస్థితి ఏర్పడుతోందని ప్రజాసంఘాలు తెలిపాయి. మూసీ కబ్జాకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖల అధికారులు, మంత్రులు, రాజకీయ నాయకులు చెబుతున్నా.. ఆ తర్వాత షరా మామూలుగా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

యథేచ్ఛగా కబ్జా..

నగరంలో మూసీ కాలువ రోజురోజుకూ కుచించుకుపోతోంది.. కొందరు రాజకీయ, ఆర్థిక పలుకుబడితో కాలువను దర్జాగా కబ్జా చేస్తున్నారు. దశాబ్దాల నాటి కాలువను కనుమరుగు చేస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని కాలువలో డంప్ చేసి చదును చేసుకుంటున్నారు. మూసీని పరిరక్షించాల్సిన జిహెచ్‌ఎంసి, రెవెన్యూ, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా మిగిలిన స్థలాలు కూడా కబ్జాకు గురవుతున్నాయి. ఓ వైపు కోట్ల రూపాయలు వెచ్చించి మూసీ నదిని ప్రభుత్వం సుందరీకరిస్తుండగా, మరో వైపు ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మూసీ పరివాహక ప్రాంతాలను పూడ్చేస్తున్నారు. మూసారాంబాగ్‌లోని మూసీ పరివాహక ప్రాంతాన్ని కొందరు కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. మూసీ బఫర్‌జోన్ ప్రాంతంలోని స్థలంలో అక్రమంగా భూమిని చదును చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, మూసీ పరివాహక ప్రాంతాన్ని రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

ఎం.మహేందర్- సిపిఎం అంబర్‌పేట్ నగర నాయకులు

మూసీ నదికి హద్దులు గుర్తించే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అందువల్లే కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. నిర్మాణ వ్యర్థాలు నదిలో డంప్ చేస్తున్నారు. మరికొందరు పార్కింగ్ ప్రదేశాలుగా మార్చుకున్నారు. కొందరు చదును చేసి కబ్జా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

వికలాంగ దళితుడిపై దాడి చేసిన సర్పంచ్‌ను శిక్షించాలి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికలాంగుడైన దళితుడిని చెప్పుతో కొట్టి అవమానించిన సర్పంచ్ సరితారెడ్డిని అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి స్కైలాబ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి మండలం బాజకుంట గ్రామానికి చెందిన అగ్రకుల సర్పంచ్ ఈదునూరి సరితరెడ్డి నడిబజారులో జనం అందరూ చూస్తుండగానే దళితుడిపై దాడి చేసి విచక్షణారహితంగా చెప్పుతో కొట్టిందని తెలిపారు. ఇది అగ్రకుల అహంకారం తప్ప మరొకటి కాదని గుర్తు చేశారు. తక్షణమే పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి ఆమెను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాజకుంట గ్రామంలో 22 దళిత కుటుంబాలకు దళిత బంధు కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల రావడంతో సర్పంచ్‌నైన తమకు లంచం ఇవ్వాలని అడిగిందనీ, నిరాకరించినందున్నే ఈ దాడికి పాల్పడిందని తెలిపారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల మేరకు ఆ గ్రామాన్ని సందర్శించి దళితులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణం విచారణ జరిపి, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి శిక్షించాల విజ్ఞప్తి చేశారు. దాడి సంఘటనను వీడియో తీసిన వ్యక్తికి సర్పంచ్ నుంచి ప్రాణ హాని ఉన్నందున అతనికి ప్రత్యేక రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ములుగులో మావోయిస్టు యాక్షన్ టీం

- పోలీసులు అప్రమత్తం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లాలో మావోయిస్టు యాక్షన్ టీమ్ సంచరిస్తోందని విశ్వసనీయ సమాచారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా ఎస్‌పి సంగ్రామ్ సింగ్ పాటిల్ ఆదివారం తెలిపారు. నలుగురు సభ్యులు గల మావోయిస్టు యాక్షన్ టీమ్ వివరాలతో ఉన్న వాల్ పోస్టర్‌ను ఎస్‌పి విడుదల చేశారు. మావోయిస్టుల ఆచూకీ తెలిపిన వారికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నగదు బహుమతి అందిస్తామని, ఆచూకీ తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. మావోయిస్టులు హింసాత్మక పద్ధతిలో సాధించేది ఏమీ ఉండదని, ఆయుధాలు వీడాలని సూచించారు.



అభివృద్ధి నిరోధకులుగా మావోయిస్టులు మారారని విమర్శించారు. ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఉక్కుపాదం మోపుతామన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మావోయిస్టు యాక్షన్ టీమ్ సభ్యుల వాల్‌పోస్టర్లు అంటించామని, అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే 7901100333, 9440795243, 9440795202, 9440795229, 9493327102 నంబర్లకు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

పంచాయతీలకు పైసల్లేవ్

- గ్రామ పంచాయతీల పేరిట ప్రత్యేక ఖాతాలు
- నేరుగా జిపిలకు డబ్బులిస్తామన్న ప్రధాని మోడీ
- ఎనిమిది నెలలుగా గ్రాంట్ విడుదల చేయని కేంద్రం
- జిపిల ఖజానా ఖాళీ..
- జీతాలకు తిప్పలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీలకు నేరుగా సెంట్రల్ గ్రాంట్స్ విడుదల చేస్తామని, కేంద్ర ప్రభుత్వం సర్పంచ్‌లను ప్రత్యేక బ్యాంకు ఖాతాలు తీసి పంపిస్తే.. నేరుగా మీ ఖాతాల్లో గ్రాంట్‌ను విడుదల చేస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. ఎనిమిది నెలలు గడుస్తున్నా కేంద్రం గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా విడుదల చేసిన పాపాన పోలేదు. నిధుల్లేక పంచాయతీల ఖజానా ఖాళీ అయి జీతభత్యాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తాయి. కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు కేటాయించే నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం ఖాతాల్లో జమ చేసేది. ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల ఖాతాల్లోకి విడుదల చేసేది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సఖ్యత ఉన్నంత కాలం నిధుల కేటాయింపు ఇలానే కొనసాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభేదాలు రావడంతో నిధుల విషయంలో ఆంక్షలు పెట్టడం మొదలు పెట్టింది. దాంతో కేంద్రం ఇచ్చే నిధులను రాష్ట్ర ఖజానాకు కాకుండా నేరుగా గ్రామ పంచాయతీలకే కేటాయిస్తామని ప్రధాని చెప్పి.. ఇప్పుడు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సర్పంచ్‌లు అంటున్నారు.

పంచాయతీలకు సెంట్రల్ గ్రాంట్స్

కేంద్ర ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీల జనాభా ఆధారంగా నిధులు కేటాయిస్తుంది. ఆ నిధులతో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, నీటి సంరక్షణ, ఒడిఎఫ్ కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. కేంద్రం ఇచ్చే నిధుల్లో 60 శాతం తాగునీరు, పారిశుధ్యం, ఒడిఎఫ్, 40 శాతం నిధులను పంచాయతీ వర్కర్లు, ఉద్యోగుల జీతభత్యాల కోసం పంచాయతీ అభీష్టం మేరకు వినియోగించుకోవచ్చు. ఆయా నిధులను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లో జమచేస్తే.. వాటిని పది రోజుల్లోగా పంచాయతీల ఖాతాల్లోకి రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసేది. కేంద్రం నుంచి వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని కేంద్రం అనుమానం వ్యక్తం చేసింది. దాంతో పది రోజుల్లోపు పంచాయతీలకు నిధులివ్వకపోతే వడ్డీతో సహా చెల్లించాలని గతంలో సూచించింది. 2022-23 నుంచి రాష్ట్ర ఖాతాల్లోకి కాకుండా నేరుగా పంచాయతీలకే నిధులిస్తామని మోడీ ప్రకటించారు. ఇంత వరకు ప్రధాని ఇచ్చిన మాట ఆచరణకు నోచుకోలేదు.

8 నెలలుగా నిధుల్లేవు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో నిధుల్లేక గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాలు ఖాళీగా ఉన్నాయి. పంచాయతీలకు కేంద్రం ఇస్తున్న నిధులను ఎనిమిది నెలలుగా నిలిపివేసింది. పంచాయతీల జనాభాను బట్టి ఒక్కొక్కరికి రూ.166 చొప్పున కేంద్ర ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాల్సి ఉండగా ప్రస్తుతం రూ.115 మాత్రమే అందిస్తోంది. కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం తమ నిధులుగా ప్రచారం చేసుకుంటున్నందున రాష్ట్రంతో సంబంధం లేకుండా నేరుగా పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. సర్పంచులు ప్రత్యేక ఖాతాలు తెరిచాక కూడా పైసా విడుదల చేయలేదు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధులను ఏప్రిల్ నుంచి విడుదల చేయాలి. సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీల్లో 15.27 లక్షల జనాభా ఉన్నారు. వీటికి నెలకు రూ.17 కోట్ల మేరకు 8 నెలలకు రూ.వంద కోట్ల వరకు సెంట్రల్ గ్రాంట్స్ విడుదల కావాల్సి ఉంది. మెదక్ జిల్లాలో 6.60 లక్షల జనాభా ఉంది. 469 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రతి నెలా రూ.7.59 కోట్ల చొప్పున రూ.60 కోట్ల వరకు నిధులు కేంద్రం నుంచి రావాలి. సిద్దిపేట జిల్లాలో 10.12 లక్షల జనాభా ఉంది. జిల్లాలో 499 గ్రామ పంచాయతీలున్నాయి. కేంద్రం నుంచి నెలకు రూ.11 కోట్ల చొప్పున రూ.93 కోట్ల మేర నిధులు రావాల్సి ఉంది.

ఖజానా ఖాళీతో జీతాలివ్వలేని పరిస్థితి

కేంద్రం నిధులతో చేయాల్సిన పైపులైన్ల లీకేజీ, పారిశుధ్య పనులు, తాగునీటి పైపులు, బోర్లు, మోటార్ల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు వంటి పనులు చేయలేకపోతున్నారు. మరోపక్క పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బంది, వర్కర్లకు నెలనెలా ఇవ్వాల్సిన జీతభత్యాలు చెల్లించలేకపోతున్నారు. తాగునీటి అవసరాలు, పారిశుధ్యం పనులు చేసేందుకు సర్పంచ్‌లు ఉద్దెర పద్ధతిలో సరుకులు తెచ్చి పనికానిస్తారు. ఎనిమిది నెలలైనా నిధుల్లేక చెల్లింపులు చేయలేదు. దాంతో ఉద్దెర(అప్పు) ఇవ్వట్లేదని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల పన్నుల రూపంలో వచ్చిన



సాధారణ నిధుల్ని విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ల కిస్తీ చెల్లింపుల కోసం వినియోగించుకోవాలని పంచాయతీ అధికారులే కార్యదర్శులపై ఒత్తిడి చేస్తున్నారు. దీన్ని సర్పంచులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

నిధుల్లేక ఏం చేయలేకపోతున్నం

- అంకని ప్రవీణ్‌కుమార్, తాళ్లపల్లి సర్పంచ్, సంగారెడ్డి జిల్లా

ఎనిమిది నెలలుగా సెంట్రల్ గ్రాంట్స్, నాలుగు నెలలుగా రాష్ట్ర నిధులు రావట్లేదు. గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో కనీసం వర్కర్లకు వేతనాలివ్వని పరిస్థితి. మంచినీటి సరఫరా, విద్యుత్, పారిశుధ్య నివారణ వంటి పనులు చేయించడం కష్టమవుతోంది. ప్రత్యేక ఖాతా తీయమంటే తీసి ఇచ్చినం. పైసా పడలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు నిధులివ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయి. మోడీవి మాటలు తప్ప చేతలుండవు.

మోడీ పంచాయతీలకు నిధులివ్వండి

- జి.మల్లేశం, బూర్గుపల్లి సర్పంచ్, మెదక్ జిల్లా

మోడీ ఇచ్చిన మాట మేరకు గ్రామ పంచాయతీలకు నిధులివ్వాలి. ప్రత్యేక బ్యాంకు ఖాతా తీసి ఇచ్చినం. ఇంత వరకు పైసలేయలేదు. గ్రామంలో చేయాల్సిన పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి పనులకు ఇబ్బంది అవుతోంది. కనీసం ట్రాక్టర్ల డీజిల్, వర్కర్ల జీతాలకు పైసల్లేని పరిస్థితి. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం ఎలాంటి నిధులివ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం పట్లనే కాకుండా గ్రామ పంచాయతీల పట్ల కూడా కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపునకు పోతుంది. పంచాయతీలకు హక్కుగా రావాల్సిన నిధుల్ని ఇవ్వకుండా జాప్యం చేయడం సరికాదు.

కేంద్రం మోసం చేస్తోంది

- ఆలేటి రజితయాదగిరి, వల్లంపట్ల సర్పంచ్, సిద్దిపేట జిల్లా

కేంద్ర ప్రభుత్వం పంచాయతీలను మోసం చేస్తోంది. ప్రధాని మోడీనే గ్రామ పంచాయతీలకు నిధుల్ని పంపిస్తామని ప్రటించారు. ఎనిమిది నెలలైనా డబ్బులివ్వకపోతే పంచాయతీల నిర్వహణ ఎలా సాగుద్ది. రాజ్యాంగం మీద గౌరవం ఉంటే వెంటనే స్థానిక సంస్థలకు హక్కుగా రావాల్సిన నిధుల్ని వెంటనే విడుదల చేయాలి. నిధుల్లేకపోవడం వల్ల గ్రామాల్లో ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చలేని పరిస్థితి. రాష్ట్రం నుంచి కూడా నిధులు రెగ్యులర్‌గా రావట్లేదు. కేంద్రం ఇవ్వాల్సిన సెంట్రల్ గ్రాంట్‌ను వెంటనే పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలి.

'కోమటిరెడ్డి' స్వయంకృతాపరాధం

- ఉప ఎన్నికలో వ్యవహార శైలే ప్రతిబంధకం
- తనకు తానే పార్టీకి దూరం
- బిజెపిలో చేరే యోచనలో వెంకన్న
- ఎన్నికలకు ముందు నిర్ణయం తీసుకుంటానని ప్రకటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీలో ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అంశం మరోసారి చర్చనీయాంశమవుతోంది. పార్టీ పదవుల్లో చోటు దక్కకపోవడంతో చర్చ జోరందుకుంది. పార్టీలో ఉంటాడా? ఇతర పార్టీల్లో చేరుతారా? పార్టీని వీడితే ముహూర్తమేంటి? తదితర విషయాలు పార్టీ శ్రేణులను తొలిచేస్తున్నాయి. నల్లగొండ పట్టణంలో ఆదివారం ఆయన నర్మగర్భంగా మాట్లాడిన అంశాలు అనుమానాస్పదంగా ఉన్నాయి. సాధారణంగా ఎన్నికలకు ముందు ఆయన ప్రతికూల నిర్ణయం తీసుకుంటారనే సంకేతమిచ్చారు. మాస్ లీడర్‌గా పేరొందిన కోమటిరెడ్డికి పార్టీ ఉన్నత పదవుల్లో చోటు దక్కపోవడంతో ఆయనపై అధిష్టానమూ సీరియస్‌గా ఉందనే సంకేతం ఇచ్చింది. దీనికంతటికి కారణం కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంకృతాపరాధమని పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీకి విధేయుడిగా ముద్రపడిన ఆయన...మునుగోడు ఉప ఎన్నికలో తమ్ముడు రాజగోపాల్‌రెడ్డికి మద్దతు ప్రకటించడంతో పార్టీలో ఆయన పతనం మొదలైందని చెబుతున్నారు. అంతేకాకుండా పార్టీ ఓటమికి పరోక్షంగా కారణమయ్యారనేది ఎఐసిసి గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. దీంతోనే ఆయనకు పార్టీ పదవుల్లో చోటు కల్పించలేదనేది నగ్నసత్యం. మునుగోడు ఉపఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్న ఆయన ఎన్నిక ముగిశాకా.. పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. విదేశాల నుంచి తిరిగొచ్చాక ఆయనకు క్రమశిక్షణ ఉల్లంఘన కింద ఎఐసిసి షోకాజ్ నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. షోకాజ్ నోటీసుకు సమాధానమిచ్చినట్టు లీకులిచ్చారు. అయితే కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమాధానంపై ఎఐసిసి సంతృప్తి చెందకపోవడంతోనే ఆయనకు పార్టీ పదవుల్లో స్థానం దక్కలేదని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. అయితే గత కొంత కాలంగా ఆయన చేస్తున్న వ్యాఖ్యలు, వ్యవహరిస్తున్న తీరు, పార్టీ ప్రయోజనాల కంటే తమ్ముడిని గెలిపించాలనే తాపత్రాయం, రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు... ఇవన్నీ ఆయనకు ప్రతిబంధకంగా మారాయి. దీంతో పార్టీ ఆయనకు పొమ్మనలేక పొగపెడుతున్నట్టు కనపడుతోంది. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. 'ఇవాళ కాంగ్రెస్ కండువా వేసుకున్న... రేపు కండువా మారవచ్చు...ఎవరికి తెలుసు' అంటూ చేసిన వ్యాఖ్యలు కూడా పార్టీలో దుమారం లేపుతున్నాయి. మంత్రి పదవిని చెప్పుతో సమానంగా చూశాను... పార్టీ పదవో లెక్కా అంటూ కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోమటిరెడ్డి తాజా వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన తమ్ముడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దారిలో నడుస్తారనే టాక్ వినిపిస్తోంది.